# సీఎంగారూ.. నన్ను బతికించండి!

- రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ ఇవ్వకుంటే నేను బతుకుడు కష్టమే
- మీరు చేసే ఆలస్యం నన్ను చావుకు దగ్గర చేస్తున్నది
- నా కిడ్నీలు పాడైనయ్.. డయాలసిస్‌కు డబ్బుల్లేవు
- దవాఖానలో హెల్త్ కార్డు చెల్లుబాటు కావడం లేదు
- ముఖ్యమంత్రికి రిటైర్డ్ ఏఎస్‌ఐ నారాయణ్‌సింగ్ లేఖ
- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి మనోవేదన
- రిటైర్డ్ ఉద్యోగుల పాలిట శాపంలా కాంగ్రెస్ సర్కార్
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్ మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): 'సీఎం రేవంత్ సారూ..నాకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ ఇప్పించం డి.. లేకుంటే నేను బతుకుడు కష్టమే.. నన్ను కాపాడండి' అంటూ ఓ రిటైర్డ్ ఏఎస్‌ఐ రాసిన లేఖ అందరినీ కంటతడి పెట్టిస్తున్నది. తనకు రావాల్సిన రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ ఇప్పిస్తే మూత్రపిండాల చికిత్స చేయించుకుంటానని ప్రాధేయపడటం ప్రతి ఒక్కరి హృదయాన్నీ కదిలిస్తున్నది. మొన్నటి వరకు శాంతిభద్రతలను కాపాడటానికి ఖాకీ దుస్తులు ధరించి బాధ్యతలు నిర్వర్తించిన ఆ పోలీసు ఇప్పుడు 'నన్ను బతికించండి' అంటూ వేడుకోవాల్సిన దయనీయ పరిస్థితి దాపురించింది. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన ఠాకూర్ నారాయణ్ సింగ్ 2024 ఆగస్టులో ఏఎస్‌ఐగా రిటైర్డ్ అయ్యారు. అతడు కిడ్నీల వైఫల్యంతో బాధపడుతున్నాడు. చికిత్సకు డబ్బు లేకపోవడంతో తనకు రావాల్సిన బెన్‌ఫిట్స్ ఇప్పించాలంటూ సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం, సీఎస్‌లకు లేఖ రాశారు. తన కిడ్నీలు పాడయ్యాయని డయాలసిస్ చేయించుకునేందుకు డబ్బులు లేవని కన్నీటి పర్యంతమవుతున్నాడు. 'రిటైర్మెంట్ బెనిఫిట్స్ డబ్బుతోనే నా డయాలసిస్ ఆధారపడి ఉన్నది. మీరు నిర్లక్ష్యం చేస్తే నేను బతుకుడు కష్టమే. వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉన్నది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా' నంటూ లేఖలో ఆవేదన వ్యక్తంచేశాడు. హెల్త్‌కార్డు చెల్లుబాటు కావడం లేదని, ఏ దవాఖానలోనూ హెల్త్‌కార్డును ఆమోదించడం లేదని పేర్కొన్నాడు. తన కుటుంబానికి తానే పెద్దదిక్కని, ఇప్పుడు తనకు ఇలాంటి ప్రాణాపాయ పరిస్థితి వచ్చిందని లేఖలో గోడు వెల్లబోసుకున్నాడు. 'మీరు చేసే ఆలస్యం నన్ను చావుకు దగ్గర చేస్తున్నది. నాకు న్యాయం చేయండి' అంటూ వేడుకున్నాడు. గతంలో తనకు రెండు సార్లు హార్ట్ స్ట్రోక్ కూడా వచ్చిందని, తనను ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నాడు.

### రిటైర్డ్ ఉద్యోగులకు శాపంలా సర్కార్: హరీశ్‌రావు



కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం 8 వేల మంది ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు శాపంగా మారిందని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశా రు. రెండు కిడ్నీలు చెడిపోయి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఆర్థిక ంగా ఇబ్బందులు పడుతున్న ఠాగూర్ నారాయణసింగ్ దైన్యాన్ని ఉదహరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డుతో చికిత్స చేసుకుందామని హాస్పిటల్‌కు వెళ్తే చెల్లదని పంపించటం దారుణమని, 30 ఏండ్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించిన ఠాగూర్ నారాయణ సింగ్ పరిస్థితి దయనీయంగా ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం విశ్రాంత పోలీసు ఉద్యోగికి శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఒక్క నారాయణ సింగ్ సమస్యనే కాదని, రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ అయిన 8వేల మంది ప్రభుత్వ ఉద్యోగుల జీవన్మరణ సమస్య అని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌కు ఉద్యోగులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, వైద్యసేవల్లో అంతరాయం కలగకుండా ఈహెచ్‌ఎస్, పోలీస్ ఆరోగ్య భద్రత కార్డులు దవాఖానల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తన గోడు వెళ్లబోసుకుంటున్న రిటైర్డ్ ఏఎస్‌ఐ నారాయణ్‌సింగ్

---



నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బాపురం శివారులో పంప్‌హౌస్ నిర్మాణం కోసం చేపట్టిన సాయిల్ టెస్టు పనులను అడ్డుకుంటున్న రైతులు

# ఎత్తిపోతల సర్వే పనుల అడ్డగింత

- సమాచారం లేకుండా తమ పొలాల్లో పనులెలా ప్రారంభిస్తారని రైతుల నిలదీత
- ఆందోళనకు సిద్ధమని హెచ్చరిక
- సీఎం సొంత జిల్లాలో నిరసన

ఊట్కూర్, ఫిబ్రవరి 4 : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బాపురం శివారులో ఎత్తిపోతల పథకంలో భాగంగా పంప్‌హౌస్ నిర్మాణం కోసం చేపట్టిన సాయిల్ టెస్టు పనులను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. నారాయణపేట-కొడంగల్-మక్తల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగు నీటితోపాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు కానున్న ఎత్తిపోతల పనులను కొద్దిరోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. మక్తల్ మండలం భూత్పూర్ జలాశయం నుంచి కాన్‌కుర్తి వరకు మూడు చోట్ల నీటిని లిఫ్ట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో భూత్పూర్ జలాశయం నుంచి ఊట్కూర్ పెద్ద చెరువుకు నీటిని తరలించి, అక్కడి నుంచి జయమ్మ చెరువుకు నీటిని పంపింగ్ చేసేందుకు ఊట్కూర్ మండలం బాపురం శివారులోని సర్వే నంబర్ 25, 26లో రైతులకు సంబందించిన వ్యవసాయ పొలాల్లో సాయిల్ టెస్టు సర్వే పనులను ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. మంగళవారం పొలాల్లో చేపట్టిన ఈ పనులను రైతులు అడ్డుకున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎలా హద్దులు గుర్తిస్తారంటూ మండిపడ్డారు. సీఎం సొంత జిల్లాలో ప్రాజెక్టు పనులను అడ్డుకోవడంతో తహసీల్దార్ చింత రవి హుటాహుటిన అక్కడికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. తమ పొలాల్లో పనులను చేపట్ట వద్దంటూ బాపురం, తిప్రాస్‌పల్లి గ్రామాల రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మరోపక్క అధికారులు రైతులు లేని సమయం చూసి కెనాల్ నిర్మాణానికి హద్దులు గుర్తిస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు ముఖ్యమంత్రి స్పందించి తమ భూములు పోకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ధైర్యం కోల్పోవద్దు

మొదటిపేజీ తరువాయి...

వచ్చిన 400 రోజుల్లో 418 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని, సగటున రోజుకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. లింగన్న భార్య లక్ష్మిని పరామర్శిస్తున్న సమయంలో ఆమె కన్నీటి ధారను ఏడేండ్ల కూతురు చిన్న చేతులతో తుడుస్తున్న దృశ్యం కలచివేసిందని చెప్పారు. తల్లుల కన్నీళ్లను బిడ్డలు తుడిచే దుస్థితి తేవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు.

### తెలంగాణ ఏర్పాటుకు రైతు సమస్యలే పునాది

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రైతు సమస్యలే పునాది అని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని రైతు కేంద్రంగానే నిర్వహించారని, రాష్ట్ర ఏర్పాటు అనంతరం వ్యవసాయ రంగ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో కృషి చేశారని వివరించారు. 'తెలంగాణలో ఎకరం భూమి పడావు పడద్దు.. రైతు చేయి పడావు ఉండద్దు' అన్న ఉద్దేశంతో కేసీఆర్ పనిచేశారని చెప్పారు. నేడు ఆ పరిస్థితులు దెబ్బతిన్నాయని, రైతులు మళ్లీ వలసలకు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ వ్యవసాయాన్ని కేసీఆర్ బాగు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన ప్రభుత్వం ధ్వంసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల ఆత్మహత్యలు జరిగితే సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు పట్టదని, కనీసం పరామర్శకు కూడా రాకుండా వీరంతా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన రైతు పిట్టల లింగన్న భార్య లక్ష్మిని ఓదార్చుతున్న బీఆర్‌ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కమిటీ సభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, రసమయి బాలకిషన్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ లక్ష్మి తదితరులు

### రేవంత్‌పై విశ్వాసం పోయింది: కొప్పుల

రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ప్రజలకు, రైతులకు పూర్తిగా విశ్వాసం పోయిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. పదేండ్లపాటు ఉన్న మంచిరోజులు పోయి, చెడ్డరోజులు దాపురించాయని రైతులు కుమిలిపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ విమర్శించారు. రైతులు అధైర్యపడవద్దని మంచిరోజులు వస్తాయని చెప్పారు. రైతులు చేసుకుంటున్న ఆత్మహత్యలన్నీ రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన హత్యలేనని, సర్కార్‌పై హత్య కేసు నమోదుచేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో ఆయన పాట, మాటతో సభికులను భావోద్వేగానికి గురి చేశారు. మ్యానిఫెస్టోలే పెట్టని అనేక పథకాలను సైతం అమలుచేసిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కొనియాడారు. రేవంత్ పాలనలో రైతులు ఆనందంగా లేరని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తేనే రైతుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. రైతు లింగన్న ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, పార్టీ తరుపున రూ.లక్ష సాయం అందిస్తామని, పిల్లల చదువులకు సాయం చేస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

### నా మనుమరాలి పేరు కూడా నైనికనే: నిరంజన్‌రెడ్డి

లింగన్న భార్య లక్ష్మి బిగ్గరగా రోదిస్తుండగా, తల్లి కండ్లలో నుంచి ధారగా వస్తున్న కన్నీళ్లను ఆమె కూతురు తుడిచింది. తల్లి లక్ష్మి కండ్ల నీళ్లను బిడ్డ తుడవడం చూసి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చలించిపోయారు. బిడ్డా నీ పేరేంటి అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించగా, నైనిక అని ఆ చిన్నారి చెప్పింది. ఈ సందర్భంగా నా మనుమరాలి పేరు కూడా నైనికనే అంటూ నిరంజన్‌రెడ్డి కండ్లల్లో నీళ్లు తీసుకోవడంతో ఆ దృశ్యాన్ని చూసిన వారందరి కండ్లు చెమ్మగిల్లాయి.

## తల్లి కన్నీళ్లు తుడిచిన చిన్నారి

### చెమ్మగిల్లిన కండ్లతో తల్లడిల్లిన నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ)/ ఇబ్రహీంపట్నం: ''రికాం లేకుండా నా మొగడు ఎవుసం పనిచేసిండు.. పిల్లలను మంచిగ సదివియ్యాలె.. మా అవ్వను.. మీ అయ్యను మంచిగ చూడాలె అనెటోడు.. బ్యాంకుల తీసుకున్న రూ.2.3 లక్షల లోన్ మాఫీ అయితది, రైతు భరోసా అత్తది అని నమ్ముకున్నడు.. అవి ఏవీ రాకపోయేసరికి ఆగమైండు.. దీనికితోడు పసుపు పంటకు పురుగు తగిలింది.. పంట సక్కగ అచ్చెటట్టు కనిపించకపోయేసరికి పిరికిల పడిపోయిండు.. సంకురాత్రి పండుగ నాడు పొద్దికి పసుపు పంటకు నీళ్లు పెడుతా అని పోయి అటే పోయిండు.. నాకు దిక్కెవ్వరు..? నా బిడ్డల గతేంది..? సార్' అంటూ రైతు పిట్టల లింగన్న భార్య లక్ష్మి కంటికి నాలుగు ధారలు పడుతుండగా ఏడ్చిన ఏడుపుతో ఇంటికి వచ్చిన వారందరూ చలించిపోయారు. తల్లి కండ్లళ్ల నుంచి వస్తున్న నీళ్లను ఆమె ఏడేండ్ల బిడ్డ తన చిట్టి చేతులతో తుడవడంతో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చలించిపోయారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన రైతు పిట్టల లింగన్న గత నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దవాఖానలో చికిత్స పొందుతూ, 20న మృతిచెందాడు. మంగళవారం బీఆర్‌ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ సభ్యులు లింగన్న ఇంటికి వెళ్లి ఆయన భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.



రోదిస్తున్న తల్లిని ఓదార్చుతున్న చిన్నారి

## దిగుబడి రాక రైతు ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో కుంగిపోయి బలవన్మరణం
- ఆసిఫాబాద్ జిల్లా బొందగూడలో విషాదం

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 4 : ఆశించిన మేర దిగుబడులు రాక.. ఆర్థికంగా నష్టపోయిన ఓ పత్తి రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం. ఆసిఫాబాద్ మండలం బొందగూడకు చెందిన పోశయ్య (55) పది ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. అనుకున్న స్థాయిలో దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయాడు. మనస్తాపంతో సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌కు పిలిచారని ఆత్మహత్య!

- మనస్తాపంతో ఆటోడ్రైవర్ బలవన్మరణం
- మేడ్చల్ జిల్లాలో విషాదం



దుండిగల్, ఫిబ్రవరి 4: ఆటో చోరీ విషయంలో పోలీసులు స్టేషన్‌కు పిలవడంతో మనస్తాపానికి గురైన ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీసులు, మృతుడి భార్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుండిగల్ మున్సిపాలిటీలోని మహేశ్వరం గురుకుల పాఠశాల సమీపంలో దండుగుల కవిత, మహేశ్(28)దంపతులు నివాసముంటున్నారు. కవిత హౌస్‌కీపర్‌గా, మహేశ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం బయటికి వెళ్లిన మహేశ్ మధ్యాహ్నం భార్యకు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్టు చెప్పాడు. మంగళవారం మధ్యాహ్నం బౌరంపేట్‌లోని డీఆర్‌కే కళాశాల సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, కుటుంబకలహాలతోనే మహేశ్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. కాగా, ఆటో చోరీ కేసులో మహేశ్‌తోపాటు అతని స్నేహితుడిని విచారణకు రావాలని 2న సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారం పోలీసులు పిలిచారని, మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని భార్య కవిత ఫిర్యాదులో పేర్కొన్నది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యాహక్కు చట్టంపై స్పందన ఏదీ?

- తెలంగాణ, పంజాబ్, జమ్మూకశ్మీర్‌పై సుప్రీం ఆగ్రహం
- తదుపరి విచారణలోగా దాఖలు చేయాలని ఆదేశాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : విద్యాహక్కు చట్టంపై దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యంపై కౌంటర్ ఎందుకు వేయలేదని తెలంగాణ, పంజాబ్, జమ్మూకశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ పిల్‌పై మంగళవారం విచారణ చేపట్టిన విక్రమ్‌నాథ్, సంజయ్ కరోల్, సందీప్‌మోహతాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయకుంటే ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించింది.

## ముగిసిన 'దిల్ రాజు' ఐటీ విచారణ



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): టాలీవుడ్ నిర్మాత, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు ఐటీ విచారణ ముగిసింది. బషీర్‌బాగ్‌లోని ఐటీ కార్యాలయంలో అధికారుల ఎదుట మంగళవారం దిల్ రాజు హాజరయ్యారు. సుమారు రెండు గంటల పాటు అధికారులు ఆయనను విచారించారు. ఇటీవల తన బ్యానర్ నుంచి విడుదలైన సినిమాల నిర్మాణ వ్యయం, ఆదాయంపై అధికారులు ఆరా తీసినట్టు తెలిసింది. ఐటీ అధికారులు అడిగిన డాక్యుమెంట్లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను దిల్ రాజు అందజేసినట్టు సమాచారం. అందుబాటులో ఉండాలని, ఎప్పుడు పిలిచినా రావాలని ఐటీ అధికారులు సూచించినట్టు తెలిసింది.

# నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

- వీఆర్‌ఏల మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడి ఉద్రిక్తం
- బీఆర్‌ఎస్ సర్కారు జీవోల అమలుకు డిమాండ్
- అడ్డుకున్న పోలీసులు.. తీవ్ర ఉద్రిక్తత

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాలు ఇస్తామని తమను నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందంటూ వీఆర్‌ఏలు, వారి వారసులు మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడి చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 81, 85 ప్రకారం వెంటనే 3,797 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వందలాది మంది తరలిరావడం, వారిని పోలీసులు రోడ్డుపైనే అడ్డుకోవడంతో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 12లో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. వీఆర్‌ఏలు, వారి వారసులు రోడ్డుపైనే బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులు, వీఆర్‌ఏల మధ్య తోపులాట జరిగింది. తమ ఆరోగ్యం బాగాలేదని కొందరు మహిళలు కాళ్లావేళ్లా పడ్డా పోలీసులు కనికరించలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు మద్దతు పలికిన రేవంత్‌రెడ్డి.. సీఎం అయ్యాక మాట మార్చారని వారు మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వారిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు మరికొంతమంది బాధితులు ప్రజాభవన్‌కు వెళ్లారు. ప్రజావాణి నోడల్ అధికారి దివ్యతో చర్చించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆమె చెప్పగా.. ప్రతిసారి ఇదే చెప్తున్నారని, ప్రభుత్వం స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. మరికొందరు బాధితులు సచివాలయానికి వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. మీడియా పాయింట్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించగా అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడిలో పాల్గొన్న వీఆర్‌ఏలు, వారి వారసులు

### 14 నెలలుగా గోస..

61 ఏండ్లకు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు వీలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,797 మంది అర్హులు ఉన్నట్టు గుర్తించారని కానీ, ఎన్నికల కోడ్‌తో అమలు కాలేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నమ్మించిందని వాపోయారు. 14 నెలలుగా అధికారులు, మంత్రుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే తమకు నియామకపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


## ఎమ్మెల్సీ స్థానాలకు మూడు నామినేషన్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. మంగళవారం మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు సీఈవో తెలంగాణ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పార్టీ తరపున కాకుండా కేవలం స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసినట్టు పేర్కొన్నారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి వేముల కరుణాకర్‌రెడ్డి, పిడిశెట్టి రాజు, అవే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి నామపత్రాలు అందజేసినట్టు తెలిపారు. వరంగల్-ఖమ్మం, నల్లగొండ టీచర్ నియోజకవర్గానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

# తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

- ప్రస్తుత నిల్వ 47.25 టీఎంసీలు
- కాల్వలకు కొనసాగుతున్న నీటి విడుదల
- 7.56 లక్షల ఎకరాల్లో పంటల సాగు

మోర్తాడ్, ఫిబ్రవరి 4: లక్షలాది ఎకరాల ఆయకట్టుకు ప్రాణాధారమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా తగ్గుతున్నది. గత డిసెంబర్ 25 నుంచి యాసంగి పంటలకు నీటి విడుదల కొనసాగుతుండటంతో రోజురోజుకు నీటి మట్టం తగ్గుతున్నది. ఎస్సారెస్పీ ద్వారా యాసంగిలో 7.56 లక్షల ఎకరాలకు సాగునీరందుతున్నది. నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని ఆయకట్టుకు ఏడు విడుతల్లో 63.86 టీఎంసీల నీటిని విడుదల చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు గత డిసెంబర్ 25 నుంచి ఇప్పటిదాకా కాలువలు, ఎత్తిపోతల పథకాల ద్వారా దాదాపు 33 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, సోమవారం నాటికి 1080.8 అడుగులు (47.25 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నది. కాకతీయ కాలువ నుంచి ఎగువ మానేరు వరకు రెండు జోన్లుగా విభజంచి వారబందీ ప్రకారం నీళ్లను వదులుతున్నారు. జోన్-1 పరిధిలో డీ-1 నుంచి డీ-53 వరకు, జోన్-2 పరిధిలో డీ-54 నుంచి డీ-94 వరకు నీళ్లిస్తున్నారు. జోన్-1కు వారం, జోన్-2కు ఎనిమిది రోజులపాటు నీటి విడుదల చేస్తున్నారు. తద్వారా నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల ఆయకట్టుకు ఢోకా లేకుండాపోయింది. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 4,500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. మూడు రోజుల క్రితం వరద కాలువ హెడ్ రెగ్యులేటర్లను మూసివేశారు. మరోవైపు, సరస్వతీకాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ నిర్మల్ జిల్లాకు సాగునీటిని అందిస్తున్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు


### నిజామాబాద్ జిల్లాలో ఎత్తిపోతల ద్వారా..

నిజామాబాద్ జిల్లాలోని ఆయకట్టుకు పలు ఎత్తిపోతల ద్వారా నీళ్లిస్తున్నారు. గుత్ప, అలీసాగర్, వేంపల్లి, బోదేపల్లి, నవాబ్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల ద్వారా యాసంగి పంటలకు నీటిని అందిస్తున్నారు. లక్ష్మి కాలువకు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ, కాలువ పరిధిలోని డీ1 నుంచి డీ 4 ద్వారా పంటలకు నీళ్లందిస్తున్నారు. వేంపల్లి ఎత్తిపోతల ద్వారా 140 క్యూసెక్కులు, బోదేపల్లి ఎత్తిపోతల ద్వారా 16, నవాబ్ ఎత్తిపోతల ద్వారా 39, అర్గుల్ రాజారాం ఎత్తిపోతల రెండు పంపుల ద్వారా 270 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేసి పంటలకు అందిస్తున్నారు.

## పెన్‌పహాడ్‌కు కోతపెట్టి..
# మోతెకు నీటి మళ్లింపు

- ఎస్సారెస్పీ తూముకు వెల్డింగ్
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పనేనని రైతుల అనుమానం

సూర్యాపేట, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : మోతె మండలానికి గోదావరి జలాలను తరలించేందుకు తూము గేటును మూసి వెల్డింగులు చేయడం ఆత్మకూర్ ఎస్ మండలంలో వెలుగులోకి వచ్చింది. గతంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ తూములన్నింటినీ మూసి వెల్డింగ్ చేసి ఖమ్మం జిల్లాకు నీటిని తీసుకుపోయిన ఆ జిల్లా మంత్రుల నిర్వాకాన్నే.. నేడు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు అమలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం ఆత్మకూర్.ఎస్ మండలం కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ తూము గేటును మూసి వెల్డింగ్ చేశారు. దీంతో నాలుగు రోజులుగా సాగునీటి సరఫరా లేదని దిగువన ఉన్న పెన్‌పహాడ్ మండలం రైతులు గగ్గోలు పెట్టినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు మంగళవారం తూము గేటు వెల్డింగ్‌ను పగులకొట్టి నీటిని మళ్లించారు. విషయం తెలుసుకొని వచ్చిన అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. గోదావరి జలాలపై ఆశలు పెట్టుకొని పంటలు సాగు చేస్తున్నామని, ఎస్సారెస్పీ నీళ్లు మోతెకు ఎలా తరలిస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పలాయనం చిత్తగించారు. తాజాగా కోదాడ నియోజకవర్గం పరిధిలోని మోతె మండలానికి నీటిని తరలించడం కూడా మంత్రి పనేనని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.



ఆత్మకూర్ ఎస్ మండలం కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ తూము గేటు వెల్డింగ్‌ను తొలగించేందుకు వచ్చిన రైతులు